పోటెత్తిన ఓట్లు ఎటు వైపు?

- ఈవీఎంలో ఒదిగిన ఓట్లు మనకేనా?
- ఏ పోలింగ్ స్టేషన్‌లోని ఓట్లు ఎవరికి అనుకూలం?
- లెక్కింపు దగ్గరపడే కొద్దీ పెరుగుతున్న ఉత్కంఠ
- జిల్లాలోనే అత్యధిక పోలింగ్ నమోదు మండపేటలోనే..

కపిలేశ్వరపురం: సార్వత్రిక ఎన్నికల ప్రజా తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. ఫలితాలు ఎవరికి అనుకూలమనే అంశం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. మే 13న పోలింగ్ జరిగే వరకూ సర్వశక్తులూ ఒడ్డిన రాజకీయ పక్షాలు పక్షం రోజుల పాటు పెన్నూ, కాగితాలతో ప్రజాతీర్పును విశ్లేషిస్తూ గడిపాయి. అదంతా ఊహాగానాలు కాగా, ప్రజాతీర్పు వెలువడే సమయం రానే వచ్చింది. 87.17 శాతం మంది ఓటు వేయడంతో కోనసీమ జిల్లాలోనే అత్యధిక పోలింగ్ శాతం నమోదైన నియోజకవర్గంగా కూడా మండపేట గుర్తింపు పొందింది.

నియోజకవర్గంలో పోలింగ్ ఇలా..

మండపేట పట్టణంలోని 30 వార్డుల్లో 48,84 మంది ఓటర్లుకు గానూ 41,870 మంది ఓటు వేయడంతో పోలింగ్ శాతం 85.71గా నమోదైంది. మండపేట మండలంలోని 12 గ్రామాల్లో 64,464 మంది ఓటర్లుకు గానూ 55,778 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 86.52 శాతం పోలింగ్ నమోదైంది. రాయవరం మండలంలోని 12 గ్రామాల్లో 53,108 మందికిగాను 46,268 ఓటు వేయడంతో 87.12 శాతం నమోదైంది. కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల్లోని 54,075 మందికి గానూ 48,043 మంది ఓటు వేయడంతో 88.84 పోలింగ్ శాతం నమోదైంది. మొత్తం మండపేట నియోజకవర్గంలోని 2,20,494 ఓట్లుకు గానూ 1,91,959 పోలై 87.17 శాతం పోలింగ్ నమోదైంది.

ఈవీఎం →



మండపేట పట్టణంలో ఓటింగ్ ఇలా...

పట్టణం	పోలింగ్ స్టేషన్లు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
మండపేట	64 - 109	48847	41870	85.71

మండపేట రూరల్ గ్రామాల్లో ఓటింగ్ ఇలా...

గ్రామం	పోలింగ్‌స్టేషన్లు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
కేశవరం	01 - 08	8,342	7,534	90.31
వేములపల్లి	09 - 15	8,280	6,683	80.71
ద్వారపూడి	16 - 21	5,622	4,726	84.06
జెడ్.మేడపాడు	22 - 26	5,433	4,849	89.25
మెర్నిపాడు	27	688	637	92.59
పాలతోడు	28 - 29	1,954	1,821	93.19
ఇప్పనపాడు	30 - 34	4,234	3,756	88.71
అర్తమూరు	35 - 39	5,501	4,884	88.78
తాపేశ్వరం	40 - 45	5,831	4,951	84.90
వై.సీతానగరం	46 - 47	1,847	1,585	85.81
ఏడిద	48 - 63	13,312	11,423	85.80
మారేడుబాక	110 - 112	3,420	2,929	85.64
మొత్తం		64,464	55,778	86.52

రాయవరం మండలంలో గ్రామాల వారీగా...

గ్రామం	పోలింగ్ స్టేషన్లు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
రాయవరం	113 - 119	6,621	5,650	8533
వెదురుపాక	120 - 123	4,467	3,926	87.89
వి.సావరం	124 - 126	2,446	2,171	88.76
నదురుబాద	127	886	824	93
లొల్ల	128	1,177	1,050	89.21
సోమేశ్వరం	129 - 135	7,051	6,191	87.80
మాచవరం	136 - 142	7,215	6,268	86.87
చెల్లూరు	143 - 151	8,751	7,383	84.37
కూర్మాపురం	152 - 153	1,936	1,750	90.39
కురకాళ్ళపల్లి	154	1,225	1,139	92.98
వెంటూరు	155 - 159	4,724	4,135	87.53
పసలపూడి	160 - 165	6,609	5,781	87.47
మొత్తం		53,108	46,268	87.12

కపిలేశ్వరపురం మండలంలోని గ్రామాల్లో పోలింగ్...

గ్రామం	పోలింగ్‌స్టేషన్లు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
నేలటూరు	166 -168	2,812	2,600	92.46
వల్లూరు	169 - 171	3,215	2,845	88.49
నిడసనమెట్ట	172 -174	2,280	2,108	92.45
కాలేరు	175 - 181	7,131	6,484	90.92
పడమర ఖండ్రిక	182-184	2,678	2,410	89.99
అంగర	185 - 193	8,382	7,393	88.20
తాతపూడి	194 - 197	3,486	2,964	85.02
కపిలేశ్వరపురం	198 - 203	5,986	5,080	84.86
కేదారిలంక	204 - 210	6,938	6,192	89.24
మాచర	211 - 2013	2,065	1,901	92.05
కోరుమిల్లి	214 - 218	5,021	4,364	86.91
అద్దంకివారిలంక	219 - 221	2,545	2,297	90.25
వాకతిప్ప	222-223	1,536	1,405	91.47
మొత్తం		54,075	48,043	88.84

ఉత్కంఠకు 24 గంటలు

- జోరుగా బెట్టింగ్‌లు
- నియోజకవర్గంలో రూ.2 కోట్లు పైనే
- రౌండ్ల వారీగా ఎవరి లెక్కలు వారివి

రామచంద్రపురం: మరో 24 గంటల్లో ఎన్నికల ఫలితాల ఉత్కంఠకు తెరపడనుండగా ఇప్పటికే నియోజకవర్గంలో భారీగా బెట్టింగ్‌లు కాశారు. కాగా రేపు జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌లో ఎన్ని రౌండ్లు, ప్రతి రౌండ్లో ఏయే గ్రామాలు ఉంటాయి, ఎన్ని ఓట్లు పోలయ్యాయి, మనకు ఎన్ని వస్తాయి, వ్యతిరేక పార్టీ వారికి ఎన్ని ఓట్లు పడతాయంటూ నియోజకవర్గ పరిధిలో ప్రతి చోట చర్చ జరుగుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక స్థాయిలో జిల్లాలోనే అధికంగా 86.59 శాతం పోలింగ్ రామచంద్రపురం నియోజకవర్గంలో జరిగింది. దీంతో ఇప్పటికే పోలయిన ఓట్లు, గ్రామాల వారీగా లెక్కలు వేసుకుని నియోజకవర్గ వ్యాప్తంగా రూ.2 కోట్ల పైనే బెట్టింగ్‌లు జరిగాయని విశ్లేషకులు అంటున్నారు. కాగా నియోజకవర్గంలోని మొత్తం 239 పోలింగ్ బూత్‌లు ఉండగా కౌటింగ్ కేంద్రం వద్ద 10 టేబుళ్లను ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి రౌండ్‌లోనూ 10 పోలింగ్ బూత్‌ల ఓట్లను లెక్కించనున్నారు. దీంతో మొత్తం 24 రౌండ్‌లలో మొత్తం ఎన్నికల కౌంటింగ్ పూర్తి కానుంది. మొదటిగా రామచంద్రపురం పట్టణ నుంచి మొదటి రౌండ్ లెక్కింపు ప్రారంభమవుతుంది. చివరి 24 రౌండ్ కె.గంగవరం మండలం శేరిల్లంక గ్రామ పోలింగ్ బూత్ ఓట్లతో లెక్కింపు పూర్తి కానుంది. మొత్తం పది రౌండ్లు కాగా ప్రతీ రౌండ్‌లోను సుమారుగా 8500 ఓట్ల నుంచి 5500 ఓట్ల వరకు లెక్కింపు జరుగుతుంది. మొత్తంగా 24 రౌండ్లలో ఓట్ల లెక్కించనుండగా ఓట్లలెక్కింపు రోజైన ఈనెల 4న రాత్రి 8 గంటల ప్రాంతంలో ఫలితం వెలువడనుంది. ప్రతి రౌండ్‌లోను గ్రామాల వారీగా లెక్కించే ఓట్ల వివరాలిలా ఉన్నాయి.

మొదటి రౌండ్‌లో... రామచంద్రపురం టౌన్‌లోని కొత్తూరు, స్టీల్‌విల్‌పేట, చాకలిపేట, గుబ్బలవారిపేట, చింతపల్లి సూరన్ననగర్, పిల్లావారివీధి, అంకంవారివీధి, రత్నంపేటలకు చెందిన ఓట్ల కౌంటింగ్, రెండో రౌండ్‌లో బ్రాడీపేట, రైస్‌పేట, రాజాకాక్ షట్ స్కూల్, సీహెచ్ సావరం బూత్‌ల ఓట్ల లెక్కింపు, మూడో రౌండ్‌లో చప్పిడివారిసావరం, రత్నంపేట 25, 26, 27, 28, 29, 30 బూత్‌ల ఓట్ల లెక్కింపు, నాలుగో రౌండ్‌లో 31,32,33, 55,56, చోడవరం, ఎస్‌ఎస్‌పేట బూత్‌ల ఓట్ల లెక్కింపు, ఐదో రౌండ్‌లో ఓదూరు, యనమదల, తాడిపల్లి, వెల్ల, వెల్లసావరం ఓట్ల లెక్కింపు, ఆరో రౌండ్‌లో వెల్ల, ఏరుపల్లి, ఉట్రుమిల్ల, వెలంపాలెం, ఏడో రౌండ్‌లో వెలంపాలెం, తిరణంపేట, మామిడిగుంట, నెలపర్తిపాడు, అడపావారిసావరం, నవరత్నాలగరువు, జగన్నాయకులపాలెం, చినతాళ్లపాలెం, ఎనిమిదో రౌండ్‌లో తాళ్ల పాలెం, ఆదివారపుపేట, ద్రాక్షారామ, తొమ్మిదో రౌండ్‌లో కందులపాలెం, కాపవరం, ఓదూరు, హసన్‌బాద, భీమక్రోసుపాలెం, పదో రౌండ్‌లో భీమక్రోసుపాలెం, తోటపేట, కన్నడతోట, వేగాయమ్మపేట, అన్నాయపేట, 11వ రౌండ్‌లో అన్నాయపేట, వెంకటాయపాలెం, బాపనయ్య చెరువు, గొల్లపాలెం, 12వ రౌండ్‌లో ఆర్యావటం, తణుకువాడ, శలపాక, డేగలపేట, మంజేరు, 13వ రౌండ్‌లో శీల, శీల లంక, కాజులూరు, 14వ రౌండ్‌లో కాజులూరు, చాకిరేవుమెరక, తిప్పరాజుపాలెం, చేదువాడ, 15వ రౌండ్‌లో బంధనపూడి, మొగలిపాలెం, మతుకుమిల్లి, తర్లంపూడి, టి.మామిడాడ, జగన్నాథగిరి, పెనుమళ్ల, అండ్రంగి, 16వ రౌండ్‌లో అండ్రంగి, అయితపూడి, కుయ్యేరు, దుగ్గుదుర్రు, 17వ రౌండ్‌లో దుగ్గుదుర్రు, పాలమూరుపాడు, ఉప్పుమిల్లి, కోలంక, నామవానిపాలెం, 18వ రౌండ్‌లో పల్లిపాలెం, యర్రపోతవరం, అద్దంపల్లి, వట్రపూడి, శివల, 19వ రౌండ్‌లో శివల, బాలాంత్రం, గుడిగళ్ల, పేకేరు, తాళ్లపాడు, కుడుపూరు, దంగేరు, 20వ రౌండ్‌లో దంగేరు, కుడుపూరు, కె.గంగవరం, 21వ రౌండ్‌లో కె.గంగవరం, తామరపల్లి, సత్యవాడ, పాణింగపల్లి, 22వ రౌండ్‌లో అముజూరు, పామర్రు, యండగండి, కూళ్ల, 23వ రౌండ్‌లో కూళ్ల, మల్లవరం, సుందరపల్లి, కోటిపల్లి, ఊడిమూడి, కోట, 24వ రౌండ్‌లో కోట, భట్లపాలిక, మసకపల్లి, బ్రహ్మపురి, కోటగుంట, శేరిల్లంక గ్రామాల ఓట్లు లెక్కించనున్నారు.



ఓటు వేసేందుకు క్యూలో నిలుచున్న ఓటర్లు (ఫైల్)

ప్రజాదరణతో మళ్లీ విజయం సాధిస్తున్నాం

కాజులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రజాదరణ లభించిందని ప్రభుత్వంపై ప్రజలకు కలిగిన విశ్వాసం, పార్టీ పట్ల వారికి గల అభిమానంతో నియోజకవర్గంలోనూ, రాష్ట్రంలోనూ ఘనవిజయం సాధిస్తున్నామని వైఎస్సార్ సీపీ నేత, తణుకువాడ పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు తాడి వెంకటరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తిగా విశ్వాసం చాటుకున్నారన్నారు. నియోజకవర్గంలో మంచి మెజార్టీతో విజయం సాధించడంతో పాటు పార్టీ రాష్ట్ర వ్యాప్తంగానూ మెజార్టీ స్థానాల్లో విజయం సాధించి వైఎస్ జగన్ మరోసారి సీఎం కానున్నారన్నారు. ఎగ్జిట్‌పోల్స్ అన్ని వైఎస్సార్ సీపీకి అనుకూలంగానే నివేదికలు ఇచ్చాయన్నారు. పార్టీ మండల సేవాదళ్ కన్వీనర్ టేకుమూడి దుర్గారావు, దంగేటి వెంకన్న, నిమ్మితి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

హోరు గాలి.. జోరు వాన

కాజులూరు: కాజులూరు మండల గ్రామాల్లో ఆదివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పల్లెవాకిట సూర్యుని వెలుగు జాడలు ప్రసరిస్తున్న వేళల్లో అకస్మాత్తుగా ఆకాశంలో మేఘాలు కమ్ముకుని జోరువాన కురిసింది. మధ్యాహ్నం వరకూ విడవకుండా ఈదురు గాలులతో వర్షం కురవటంతో మండల గ్రామాల్లో పలు చోట్ల చెట్లు విరిగిపడగా పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగి వైర్లు తెగిపడ్డాయి. దీంతో పలు పల్లె గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. స్థానికులు స్వచ్ఛందగా రోడ్లపై విరిగిపడిన చెట్టుకొమ్మలను తొలగించుకుని మార్గాలను సరి చేయగా ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ స్తంభాలను, వైర్లను సరి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వర్షాల ప్రభావం జిల్లాలో మరో రెండు రోజుల పాటు తీవ్రంగా ఉంటుందని వాతావరణం నిపుణులు సూచిస్తున్న తరుణంలో ఆదివారం ఈదురు గాలులతో కురిసిన వర్షం బీభత్సం మండల గ్రామాల ప్రజలను మరితం భయాందోళనలకు గురి చేసింది.



భారీ వర్షానికి కోలంక పీఏసీఎస్ భవనంపై కూలిన చెట్టు

చల్లబడిన వాతావరణం

కె.గంగవరం: గత నాలుగు రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతంగా మారి ఈదురుగాలులు, ఉరుములతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ప్రజలు డాబాలపై చేరి చల్లని ఈదురుగాలలను ఆస్వాదించారు. ఎండ తీవ్రతతో వృద్ధులు, చంటిపిల్లలు సతమతమవుతున్న తరుణంలో వాతావరణ చల్లబడడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. రెండు గంటల పాటు వర్షం ఏకధాటిగా కురిసింది. ఈదురు గాలుల తీవ్రతకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



మబ్బులతో మేఘావృతమైన ఆకాశం

అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు

కపిలేశ్వరపురం: మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఇటీవల టేకి, మాచర గ్రామాల్లో తవ్వకాలు జరుపుతుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. కాగా ప్రభుత్వ అధికారుల నుంచి అనుమతి లేకుండా ఆదివారం మండలంలోని అంగరలోని వ్యవసాయ భూముల నుంచి కొందరు మట్టి తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న వీఆర్వో పెద్దింశెట్టి నాగమణి అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు. సొంత వ్యవసాయ భూముల్లో మెరకలను తొలగించుకోవాలన్నా రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. ట్రాక్టర్‌పై మట్టిని తరలిస్తుండగా అడ్డుకుని విచారించారు. ఓఎన్‌జీసీ రహదారి సమీపంలోని వ్యవసాయ భూమిలో మట్టి తవ్వకాలు జరుపుతున్నట్టు తేలింది. ట్రాక్టరు డ్రైవర్ పరారయ్యాడు. జేసీబీ యంత్రాన్ని, ట్రాక్టర్‌ను అంగర పోలీసులకు స్వాధీనపరిచినట్టు వీఆర్వో నాగమణి తెలిపారు.



అంగరలో వ్యవసాయ భూముల్లో జేసీబీతో మట్టి తవ్వకాలు

విద్యార్థులకు ఐరన్ బాక్సుల పంపిణీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేట గ్రామానికి చెందిన దళిత పేద కళాశాల విద్యార్థులు 12 మందికి వేగాయమ్మపేటకు చెందిన ప్లెంటీ టు సేర్ మినిస్ట్రీస్ ఫౌండర్ ప్రెసిడెంట్, కరోనా వారియర్ 2020 అవార్డు గ్రహీత రెవరెండ్ డాక్టర్ గునిపే విజయరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఐరన్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు యూనిఫాంలు శుభ్రంగా, హుందాతనంగా ఉండేందుకు ఇస్త్రీ నిమిత్తం తమ ఇంటిలోనే చేసుకునే విధంగా ఈ ఆలోచన చేసినట్లు తెలిపారు. గ్రేస్ విక్టోరియా, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ జి.శార విక్టోరియా, గ్రామ సర్పంచ్ కోరపు కామరాజు, గ్రామ పెద్దలు కనికెళ్ల కృష్ణ, కాటి శ్రీనివాస్, వడ్డి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పేద దళిత విద్యార్థులకు ఐరన్ బాక్సులు అందజేసిన గునిపే విజయరాజు తదితరులు

ఉచిత హోమియో వైద్యశాల

కె.గంగవరం: మండలంలోని పాత కోట గ్రామంలో ఆదివారం ద వరల్డ్ టీచర్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇప్పటి నుంచి ప్రతి నెలా మొదటి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్యశాలను విశాఖపట్నానికి చెందిన సద్గురు పీఠం అధ్యక్షుడు గురుప్రసాద్, కార్యదర్శి బీఆర్‌కే రాజు ప్రారంభించారు. కాకినాడ, రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ హోమియో వైద్యులు ఈ వైద్యశాల వద్ద పరీక్షలు చేస్తారని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అనంతరం ఈ వైద్య శిబిరంలో సుమారు 100 మందికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు వీరరాఘవ, జీఆర్ఎస్ఎస్ శర్మ, వర్ష, యశస్వి, ఐశ్వర్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



శిబిరం వద్ద రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

బాక్సింగ్ చాంపియన్ అశోక్‌కు ఆర్థిక సాయం

రాజోలు: ఇంటర్నేషనల్ మౌతాయి బాక్సింగ్ చాంపియన్ కొల్లాటి అశోక్‌కు అంతర్వేది మహా గజమాల వ్యవస్థాపకుడు చింతా మహా నాగరాజు రూ.60 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆదివారం పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు చేతుల మీదుగా ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నార్త్ అమెరికా లోవా సిటీలో జరిగే మౌతాయి బాక్సింగ్ 86 కేజీల విభాగ పోటీల్లో అశోక్ పాల్గొంటున్నారని మహా నాగరాజు వివరించారు. పోటీల్లో పాల్గొనేందుకు సుమారు రూ.7.50 లక్షల ఖర్చవుతుందని అందుకే రాజోలు నియోజకవర్గ అగ్నికుల క్షత్రియుల ఆధ్వర్యంలో ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నామన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పుట్టిన రోజున రూ.75 వేల ఆర్థిక సాయం అందజేస్తారని ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మౌతాయి బాక్సింగ్ పోటీల్లో అశోక్ భారత దేశ ఖ్యాతిని నిలబెడతాడని నమ్మకం ఉందన్నారు. క్రీడాభిమానులంతా అశోక్‌కు అండగా నిలవాలని కోరారు. రాజోలు నియోజకవర్గ అగ్నికుల క్షత్రియుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఇల్లింగి వెంకటరమణ, రాష్ట్ర నాయకులు ఓలేటి సూర్యప్రకాశరావు, వైదాని నూకరాజు, కొల్లు రాము, మహాలక్ష్మి, వీరాబాబు, తిరుమాని రామశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మల్లాడి కృష్ణారావు సమక్షంలో ఆర్థిక సాయం అందిస్తున్న అగ్నికుల క్షత్రియ నాయకులు

యోగాతో ఆత్మస్థైర్యం

అంబాజీపేట: విద్యార్థి దశ నుంచే యోగా శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థులకు ఆత్మస్థైర్యం పెంపొందిస్తుందని, అందుకు అనుగుణంగా మేధాశక్తి పెరుగుతుందని అంబాజీపేట స్వామి వివేకానందా యోగా ఆశ్రమ గురువు శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు యోగా చేయించి, నీతి కథలు చదివించి, జాతీయ గీతాలను పాడించారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం ఆసక్తి పెంచుకోవాలన్నారు.

క్లుప్తంగా

సీతారామ క్షేత్రంలో ఏకాదశి పూజలు



సీతారామచంద్రులను అభిషేకిస్తున్న ఆలయ అర్చకుడు

మండపేట: ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని బురుగుంట చెరువు వద్ద గల సీతారామ క్షేత్రంలోని సీతారామ చంద్రమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మల్లిపూడి గణేశ్వరరావు, మల్లిపూడి కొండయ్య కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో అర్చకుడు వరదాచార్యులు శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

విజేత తోట త్రిమూర్తులే!

మండపట: సార్వత్రిక ఎన్నికల్లో మండపేట ఎమ్మెల్యేగా తోట త్రిమూర్తులు గెలుపు ఖాయమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచుల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి బూరిగ ఆశీర్వాదం అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎస్సీ, బీసీలతో పాటు మెజారిటీ కాపు సామాజిక వర్గం వారు ఫ్యాన్ గుర్తుకే ఓట్లు వేశారన్నారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక తిరుగులేని మెజారిటీతో రెండోసారి రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పేదల స్థితిగతులు తెలుసుకుని, సువర్ణ పాలన అందించిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు.

వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి

కాజులూరు: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు సలాది వీరబాబు తదితరులు కోరుతున్నారు. ఆదివారం కాజులూరులో వీరబాబు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ వర్షాల కారణంగా గ్రామంలో అపారిశుద్ధ్యం తలెత్తి అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. గతంలో వర్షాలు సమీపించిన వెంటనే గ్రామంలో అపారిశుద్ధ్యం తలెత్తి పలువురు డెంగీ, విషజ్వరాల బారిన పడ్డారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల్లో చైతన్య పరచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

లెక్కింపు రోజు విజ్ఞత ప్రదర్శించాలి



కోరుమిల్లిలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్సై పరదేశి

కపిలేశ్వరపురం: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు రోజున క్షేత్ర స్థాయిలో ప్రజలంతా విజ్ఞతను ప్రదర్శించాలని అంగర ఎస్సై అందే పరదేశి కోరారు. లెక్కింపు ప్రక్రియలో భాగంగా పోలీసు ఉన్నతాధికారులు రూపొందించిన నియమ నిబంధనలను విధిగా పాటించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆదివారం ఆయన మండలంలోని కోరుమిల్లి గ్రామంలో పర్యటించారు.

రౌడీషీటర్లకు ఎస్సై కౌన్సెలింగ్



రాయవరం స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై నరేష్

రాయవరం: ఈ నెల 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు సృష్టించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని రాయవరం ఎస్సై జి.నరేష్ హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ రౌడీ షీట్ తెరవబడిన వారు ఎటువంటి గొడవల్లో పాల్గొన రాదన్నారు. ఇంటి వద్దే ఉండాలని, బయట తిరగరాదని సూచించారు. ఏ విధమైన గొడవల్లో పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి వదిలారు. మండలంలో ఏడుగురు రౌడీ షీటర్లు ఉండగా, వారిలో ఒకరు జైలులో ఉండగా, మిగిలిన ఆరుగురికి కౌన్సెలింగ్ ఇచ్చినట్టు ఎస్సై నరేష్ తెలిపారు.